జజ్జనకరి జనారే.. జన జాతరే

- దారులన్నీ ఉదయగిరి వైపే
- అట్టహాసంగా రాజారెడ్డి నామినేషన్
- కనీవినీ ఎరుగని రీతిలో తరలివచ్చిన అభిమాన జనవాహిని
- ఆంజనేయస్వామి ఆలయం, చర్చి, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డి నామినేషన్‌కు తరలివచ్చిన అశేష జనవాహినితో ఉదయగిరి జనసంద్రమైంది. నియోజకవర్గంలోని దారులన్నీ ఉదయగిరి వైపు కదలిరావడంతో ఉదయగిరి అభ్యర్థుల నామినేషన్ చరిత్రలో ఏ అభ్యర్థికీ రానంత జనం రాజగోపాల్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి తరలివచ్చారు. అశేష జనవాహిని, అభిమానుల కేరింతలు, కోలాహలం నడుమ బుధవారం రాజగోపాల్‌రెడ్డి నామినేషన్ పర్వం ఆద్యంతం అట్టహాసంగా సాగింది.


ఆంజనేయస్వామి ఆలయంలో మేకపాటిని ఆశీర్వదిస్తున్న వేదపండితులు

ఉదయగిరి: ఉదయగిరి ప్రజలతో నాలుగు దశాబ్దాలకుపైగా ఉన్న అనుబంధాన్ని పెనవేసుకున్న మేకపాటి కుటుంబానికి చెందిన రాజగోపాల్‌రెడ్డి నామినేషన్ ఘట్టం 'నభూతో నభవిష్యతి' అన్నట్లుగా సాగింది. ఆ కుటుంబంపై ఉదయగిరి ప్రజలకున్న ప్రేమాభిమానాలకు అద్దం పట్టింది. ఉదయగిరితో పాటు సీతారామపురం, వరికుంటపాడు, దుత్తలూరు, కొండాపురం, వింజమూరు, కలిగిరి, జలదంకి మండలాల నుంచి కనీవినీ ఎరుగని రీతిలో నేల ఈనినట్లుగా జనం తరలివచ్చారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా నామినేషన్ పర్వం పూర్తయి తర్వాత ఒంటి గంట వరకు వేలాది మంది జనం ఎండలోనే వేచి చూశారు. రాజగోపాల్‌రెడ్డి నామినేషన్ వేసి బయటకు వచ్చిన వెంటనే తమ అభిమాన నేతకు జేజేలు పలుకుతూ జై జగన్.. అంటూ నినదాలతో హోరెత్తించారు. మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో ఉదయం ఏడు గంటలకు తన నివాసంలో కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించి భారీ కాన్వాయ్‌తో ఉదయగిరి చేరుకున్నారు. దేవాలయంలో వేదపండితులు, చర్చి, మసీదుల్లో మతపెద్దలతో ప్రార్థనలు చేసి ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఉదయం పది గంటలకు ఏబీఎం గ్రౌండ్‌కు చేరుకున్న వేలాది మంది జనవాహినితో కలిసి ప్రచార రథంపై వైఎస్సార్ విగ్రహం, ట్యాంక్‌బండ్, పంచాయతీ బస్టాండ్ చేరుకున్నారు. ఏబీఎం గ్రౌండ్ నుంచి పంచాయతీ బస్టాండ్ వరకు 200 మీటర్లు మాత్రమే ఉండగా ఈ దూరం చేరుకోవడానికి రెండున్నర గంటల సమయం పట్టింది. ఉదయగిరి పట్టణానికి వచ్చే నలుదారులు జనసందోహంతో నిండిపోయాయి. దీంతో ఇంకా ఎంతో మంది నామినేషన్ కేంద్రానికి చేరుకోలేకపోయారు.

నాలుగు సెట్లు దాఖలు చేసిన మేకపాటి కుటుంబీకులు

ఉదయగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డి రెండు సెట్లు, ఆయన తనయుడు మేకపాటి అభినవ్‌రెడ్డి రెండు సెట్లు నామినేషన్లు వేశారు. మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ మోది రామాంజనేయులు, అల్లూరురాజుతో కలిసి ఆర్వో రాజారమేష్ ప్రేమ్‌కుమార్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు.

అడుగడుగునా అభిమానం

అడుగడుగునా, అవధుల్లేని అభిమానం కనబరిచారు. వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అడుగడుగునా పూల వర్షం కురిపిస్తూ క్రేన్‌ల ద్వారా గజమాలలతో తమ అభిమాన నేతను సత్కరిస్తూ భారీ బాణసంచా సందడితో ఉదయగిరి దద్దరిల్లింది. వైఎస్సార్‌సీపీ జెండాను పోలిన రంగులతో ఆకాశం వైపు దూసుకెళ్లిన బాణసంచా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ నామినేషన్ పర్వానికి వచ్చిన జనవాహినిని చూస్తే రాజగోపాల్‌రెడ్డి విజయం నల్లేరుపై నడకగా సాగుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఉదయం పది గంటలకే సుమారు 25 వేల మంది జనం తరలివచ్చారు. ఉదయం 11 గంటల సమయానికి ఇంకా జనం తరలిరావడంతో ఉదయగిరి పట్టణానికి అర కిలోమీటరు అవతలే చాలా మంది ఆగిపోయారు. దీంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. కావలి డీఎస్పీ వెంకటరమణ, దిశా డీఎస్పీ నాయిసాథ్ ఆధ్వర్యంలో పోలీసులు తహసీల్దార్ కార్యాలయం వద్ద బ్యారికేడ్లు ఏర్పాటు చేసి నామినేషన్ సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నారు. ఉదయగిరి చరిత్రలో నామినేషన్ కార్యక్రమానికి ఇంతమంది జనం తరలిరావడం తామెప్పుడూ చూడలేదని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు.

ప్రజలు ఫ్యానుకు పట్టం కట్టాలని ఉత్సాహంగా ఉన్నారు

- విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

వచ్చే నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో జనం ఫ్యాను గుర్తుపై ఓటేసి మళ్లీ వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తెచ్చేందుకు ఎంతో ఉత్సాహంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే కాటం విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ఏ వైపు చూసినా ఫ్యాను హవా నడుస్తోందన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు మంచి మెజార్టీతో విజయం సాధిస్తారని చెప్పారు. ఉదయగిరిలో మేకపాటి కుటుంబం నుంచి వచ్చిన కొత్త అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి విజయం నామినేసన్ రోజే ఖరారైందన్నారు. నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకునేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. రాష్ట్ర భవిష్యత్, పేదల జీవితాలు బాగుపడాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలన్నారు.

అట్టహాసం.. విక్రమ్ నామినేషన్ ఘట్టం

- వేలాదిగా తరలివచ్చిన ప్రజలు
- మండుటెండల్లోనూ ర్యాలీగా సాగిన మహిళలు
- అడుగడుగునా మంగళహారతుల నీరాజనాలు, పూలజల్లులు


ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, తదితరులు

ఆత్మకూరు: ఆత్మకూరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా మేకపాటి విక్రమ్‌రెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు అపూర్వ ఘట్టంగా నిలిచింది. తొలుత అంకమ్మమాను వద్ద పూజలు నిర్వహించి తల్లి మణిమంజరి వద్ద ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం సుల్తాన్ షాహీద్ దర్గా, తెలుగు బాప్టిస్టు చర్చిలో ప్రార్థనల అనంతరం మత పెద్దలు ఆశీస్సులు అందజేశారు. అనంతరం ప్రజల జేజేలు నడుమ విశేష పూలతో అలంకరించిన ప్రత్యేక వాహనంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల కోలాహలం నడుమ భారీ ర్యాలీగా సాగుతూ నామినేషన్ దాఖలు చేసే కార్యాలయానికి కదిలారు. దారి పొడవునా మహిళలు మంగళ హారతులతో నీరాజనాలు పలికారు. దారి వెంట ఉన్న మేడలపై నుంచి పలువురు అభిమానులు ప్రత్యేక వాహనంలో వస్తున్న విక్రమ్‌రెడ్డిపై పూలు చల్లుతూ తమ అభిమానం చాటుకున్నారు. సత్రం సెంటర్ నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభమైన ఈ ర్యాలీలో యువత డీజే సౌండ్, తీన్మార్ బ్యాండ్‌కు ఉత్సాహంగా నృత్యాలు చేశారు. ర్యాలీలో కీలు గుర్రాలు, కేరళ ప్రత్యేక వాయిద్య బృందం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నామినేషన్ దాఖలు చేయడానికి సూచించిన సమయానికి ఊరేగింపు ఆర్‌ఓ కార్యాలయానికి చేరలేని పరిస్థితుల్లో ప్రజల సమక్షంలోనే పత్రాలపై సంతకాలు చేసి తమ సిబ్బందితో ఆ పత్రాలను ఆర్‌ఓ కార్యాలయానికి పంపించారు. ర్యాలీకి అగ్రభాగాన వైఎస్సార్‌సీపీ జెండా చేపట్టిన నలుగురు కార్యకర్తలు గుర్రాలపై సాగడం పలువురిని ఆకట్టుకుంది. వారి వెనుక దివంగత వైఎస్సార్, మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి, తదితరుల చిన్న కటౌట్లను అట్టహాసంగా చేత బట్టి ర్యాలీలో సాగడం ఆకర్షణగా నిలిచింది. ర్యాలీలో పట్టణంలోని ఎరుకలసానినగర్‌కు చెందిన యువకులు కర్రసాము విద్య ప్రదర్శించడం అత్యంత ఆకర్షణగా నిలిచింది. మున్సిపల్ బస్టాండ్ సెంటర్‌కు ర్యాలీ చేరుకోవడంతో అభిమానులు ఏర్పాటు చేసిన భారీ గజమాలను క్రేన్ సాయంతో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డితో పాటు తదితర నాయకులకు వేయడం పలువురు ఆసక్తిగా చూశారు. నామినేషన్ కార్యక్రమానికి అంకమ్మమాను వద్దకు ఎమ్మెల్యే సమీప బంధువులతో పాటు తల్లి మేకపాటి మణిమంజరి, భార్య వైష్ణవి, వదిన (గౌతమ్‌రెడ్డి సతీమణి) శ్రీకీర్తిరెడ్డి ముందుగా చేరుకున్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ అల్లారెడ్డి అనసూయమ్మ, మున్సిపల్ మహిళా కౌన్సిలరు తిరుపతమ్మ, రాధిక, కొండా స్వరూపరాణి, త్రివేణి, గుడి సంధ్య, తదితరులు వారికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు మేకపాటి పృథ్వీకుమార్‌రెడ్డి, పట్టణ పార్టీ నాయకుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ ఆదిశేషయ్య, బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, తారకనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీలు సుధాకర్‌రెడ్డి, రాపూరు వెంకటసుబ్బారెడ్డి, నాయకులు ఐవీ రమణారెడ్డి, డాక్టర్ జే ప్రణీత్, షేక్ పర్వీన్, ఎన్ ప్రసాద్, ప్రతాప్, ముజీబ్, ముతీవర్, జమీర్, కలాం, ఏఎస్‌పేట, సంగం, మర్రిపాడు, చేజర్ల, అనంతసాగరం, ఆత్మకూరు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ర్యాలీలో ఆకర్షణగా నిలిచిన కేరళ వాయిద్య బృందం


చిన్న కటౌట్లు చేతబట్టి ర్యాలీలో సాగుతున్న దృశ్యం

క్లుప్తంగా

శివాలయంలో హుండీ చోరీ

ఉదయగిరి: మండలంలోని గుడినరవ శివారులోని పురాతన శివాలయంలో మంగళవారం రాత్రి సమయంలో గుర్తుతెలియని గుర్తుతెలియని వ్యక్తులు ఆలయ ప్రహరీ దూకి ప్రధాన గేటు తాళం ధ్వంసం చేసి లోపలి హుండీని తీసుకెళ్లారు. ఆలయం సమీపంలోని కుంటవద్ద హుండీని పగులగొట్టి నగదు తీసుకుని హుండీ అక్కడే వదిలివెళ్లారు. బుధవారం ఉదయం అటు వైపు పొలం వెళ్లిన వారు కుంటవద్ద హుండీ ఉండడం గమనించి గ్రామస్తులకు సమాచారం అందించారు. పలువురు గ్రామస్తులు ఆలయానికి వచ్చి పరిశీలించుకుని చోరీ జరిగినట్లు గుర్తించారు.

కారు, బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు


కారు కిందకు దూసుకెళ్లిన బైక్

మర్రిపాడు: నెల్లూరు వైపు వెళ్తున్న కారు సంగం వైపు వస్తున్న బైక్‌ను ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సంగం సమీపంలోని ర్యాంపు వద్ద బుధవారం జరిగింది. స్థానికులు వెంటనే క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి దర్యాప్తు విచారిస్తున్నారు.

ఆరోగ్య సురక్ష సేవలను సద్వినియోగం చేసుకోండి

- అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలి


ఆత్మకూరు అర్బన్ అస్పత్రిలో మలేరియాపై అవగాహన కల్పిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ

ఆత్మకూరు: వైద్య ఆరోగ్యశాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలి కోరారు. పట్టణంలోని అర్బన్ పీహెచ్‌సీలో డాక్టర్ అస్మా ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సురక్షలో గర్భకోశ వ్యాధుల నిపుణులు జనరల్ ఫిజీయన్, చిన్నపిల్లల వ్యాధి నిపుణులు పాల్గొని ఆయా విభాగాల సేవలు అందిస్తున్నట్లు ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రపంచ మలేరియా దినోత్సవం గురువారం జరగనున్న నేపథ్యంలో మలేరియా వ్యాధి సంక్రమించే విధానం గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలి వివరించారు. హెల్త్ సిబ్బంది సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశ వాలంటీర్లు పాల్గొన్నారు.

మరోసారి జగనన్న సీఎం కావడం ఖాయం

- మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం సీఎం జగనన్న చేసిన పాలన మెచ్చి వేలాది జనం తరలి రావడం చూస్తే, మరోసారి ఆయన ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఉదయగిరి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఉదయగిరిలో బుధవారం నామినేషన్ దాఖలు సందర్భంగా వచ్చిన జనవాహిని ఉద్దేశించి మాట్లాడారు. మండుటెండను లెక్క చేయకుండా, జగనన్న పాలనపైన, మా కుటుంబం పైనా ఉన్న అభిమానంతో వచ్చిన జన సంద్రం చూస్తే తన గెలుపు సందేహం లేదని, వైఎస్సార్‌పీపీ మళ్లీ అధికారం చేపట్టడం ఖాయమని తేలిపోయిందన్నారు. సీఎం బస్సు యాత్రకు ఊహించని జనాదరణ చూసి టీడీపీ, ఎన్‌డీఏ కూటమి గుండెల్లో రైళ్లు పరుగులు తీస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు చేజర్ల సుబ్బారెడ్డి, జి.ఓబులరెడ్డి, వినయ్‌రెడ్డి, అక్కి భాస్కర్‌రెడ్డి, చింతంరెడ్డి సుబ్బారెడ్డి, ఎల్‌పీ మాలకొండారెడ్డి, డి.జయసింహారెడ్డి, గణపం బాలకృష్ణారెడ్డి, పాలూరు మాల్యాద్రిరెడ్డి తదితరులు ఉన్నారు.

తనిఖీల్లో నగదు స్వాధీనం



సంగం: సంగం చెక్‌పోస్టు పోలీసు తనిఖీ కేంద్రం వద్ద కారులో ఎటువంటి సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.1.67 లక్షలు నగదు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నెల్లూరు నుంచి వాశిలికి వెళ్తున్న కారును ఎస్సై నాగార్జునరెడ్డి తనిఖీ చేయగా నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రజలు రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లకూడదన్నారు.

అనాథలైన చిన్నారులకు ఆర్థిక సాయం



ఆత్మకూరు: పట్టణంలోని 16వ వార్డులో నివశిస్తున్న సయ్యద్ ఖాజా, ఆయన భార్య బీబీజాన్ ఇటీవల మృతి చెందడంతో వారి ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నేత డాక్టర్ జే ప్రణీత్ మంగళవారం డాక్టర్ వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ తరఫున రూ.15 వేలు ఆర్థిక సాయం చేశారు.

పతివ్రతమ్మ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

ఆత్మకూరురూరల్: మండలంలోని రామస్వామిపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో పతివ్రతమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. గురువారం యంత్ర ప్రతిష్ఠ, రుద్రాభిషేకం, ఛండీ హోమం, మంగళహారతి జరుగుతుందని, అదే రోజు సాయంత్రం అమ్మవారి మూలమూర్తి గ్రామోత్సవం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. 26వ తేదీ ఉదయం 9 నుంచి 10.30 గంటలలోపు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, సాయంత్రం 4 గంటలకు పాల పొంగళ్ల కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

వైద్యశాల ఆకస్మిక తనిఖీ

అనుమసముద్రంపేట: మండలంలోని చిరమన పీహెచ్‌సీ, హసనాపురంలోని ఉపకేంద్రాలను జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యాధి నిరోధక టీకాల నిల్వ గదిని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి కేసులను క్షుణ్ణంగా గుర్తించాలని, వారికి అవసరమైన చికిత్సను వైద్యశాలలోన అందించాలని డాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ జ్యోతిరాణి, డాక్టర్ నాగవినూత, వైద్య సిబ్బంది జ్యోతి, సింధూర, పోలిరెడ్డి, ఆశా కార్యకర్తలు, 108 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రమంతా ఫ్యాన్ ప్రభంజనం


రుద్రకోటలో ఎన్నికల ప్రచారంలో మస్తాన్‌రావు, ప్రతాప్‌కుమార్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి


కొత్తపల్లిలో సందడిగా సాగుతున్న ప్రచారం

- ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి

కావలి: రాష్ట్రంలో మే 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తు ప్రభంజనం సృష్టించడం ఖాయమని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తపల్లి, సిరిపురం, చలంచర్ల, రుద్రకోట, తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఎన్నికలు చరిత్రలో నిలిచిపోనున్నాయని తెలిపారు. ప్రజలను, ప్రజలకు చేసిన మంచిని మాత్రమే నమ్ముకున్న వైఎస్సార్‌సీపీ ఒక వైపు, అధికారం కోసం కూటమి కట్టిన పార్టీలన్నీ మరో వైపు నిలబడ్డాయని తెలిపారు. అయితే కూటమి కుట్రలు ముందుగానే కనిపెట్టిన ప్రజలు వైఎస్సార్‌సీపీకి అండగా నిలవడంతో రాష్ట్రంలోని ఏ ప్రాంతంలో చూసినా ఫ్యాన్ ప్రభంజనమే కనిపిస్తుందని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ అభివృద్ధిని, సంక్షేమాన్ని, ప్రజల విశ్వాసాన్ని మాత్రమే నమ్ముకుని బరిలో నిలిచిందన్నారు. కావలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత జరిగిన సుస్థిర అభివృద్ధి గతంలో ఎన్నడూ జరగలేదన్నారు. రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె హార్బర్, అనుబంధ పరిశ్రమలతో నియోజకవర్గం రూపురేఖలే మారనున్నాయన్నారు. నియోజకవర్గంలో రానున్న పారిశ్రామిక కారిడార్, దామవరం ఎయిర్ పోర్టులతో నియోజకవర్గంలోని యువత మొత్తానికి స్థానికంగానే ఉద్యోగాలు లభిస్తాయని వివరించారు. సుస్థిర అభివృద్ధితో పాటు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసినట్లు తెలిపారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి పథకాల రూపంలో ప్రభుత్వం భరోసా కల్పించిందన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి కావలి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా తనను, నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, స్థానిక సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుతోనే పేదల సంక్షేమం

- రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు

కావలి: రాష్ట్రంలో పేదల సంక్షేమం ఫ్యాన్ గుర్తుతోనే సాధ్యమని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు అన్నారు. కావలి మండలంలోని రుద్రకోటలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి బీద మస్తాన్‌రావు బుధవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి కావలి ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె హార్బర్లతో ఇప్పటి కావలి ప్రగతికి అడుగులు పడ్డాయని, కేంద్రంతో సత్సంబంధాలు ఉన్న విజయసాయిరెడ్డి ద్వారా అనుబంధ పరిశ్రమలు, దామవరం విమానాశ్రయం, బిట్రగుంట రైల్వే ప్రగతితో కావలి నియోజకవర్గం పెద్ద పెద్ద నగరాల స్థాయిలో అభివృద్ధి చెందుతుందని, ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని తెలిపారు. కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, అల్లూరు మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు.

8 రోజులు.. 8 ప్రాణాలు

- ఫిబ్రవరి 10న ఎనిమిది మంది మృత్యువాత
- మృత్యు ఘంటికలు మోగిస్తున్న హైవే
- రోడ్డుమార్జిన్‌లో ఆగి ఉన్న లారీలే ప్రమాదానికి కారణాలు
- డేంజర్ జోన్‌గా మారిన టోల్‌ప్లాజా ప్రాంతం


కావలి: టోల్‌ప్లాజా సమీపంలో బుధవారం వేకువన ఆగి ఉన్న కంటెయినర్ లారీని ఢీకొన్న కారును క్రేన్‌తో తొలగిస్తున్న దృశ్యం


కావలి: గౌరవరం సమీపంలో ఈనెల 16న లారీని ఢీకొన్న కారు (ఫైల్)

ముసునూరు టోల్‌ప్లాజా సమీపంలో హైవేపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. రోడ్డు మార్జిన్‌లో నిలుపుతున్న లారీలు మృత్యు ఘంటికలు మోగిస్తుండటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆగి ఉన్న లారీల కారణంగా ఇటీవల కాలంలో జరిగిన ప్రమాదాలు ఇందుకు అద్దం పడుతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 10న రోడ్డు మార్జిన్‌లో ఆగి ఉన్న లారీని వెనుక వస్తున్న మరో లారీ ఢీకొనడంతో ఆ వేగంతో అదుపు తప్పిన వాహనం డివైడర్ దాటి మరో వైపు వెళ్తున్న ట్రావెల్స్ బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది మృత్యువాత పడ్డారు. ఈ నెల 16న గౌరవరం సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. తాజాగా టోల్‌ప్లాజా వద్ద ఆగి ఉన్న కంటెయినర్‌ను ఢీకొనడంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు.

కావలి: కావలి– గౌరవరం మధ్య హైవే డేంజర్ జోన్‌గా మారింది. మితిమీరిన వేగంలో రోడ్డుమార్జిన్‌లో నిలిపివేస్తున్న భారీ వాహనాలను తప్పించే ప్రయత్నంలో అదుపు చేయలేకపోవడం ప్రమాదాలకు కారణాలు అవుతున్నాయి. ఇటీవల జరిగిన ఘటనలు అందుకు అద్దం పడుతున్నాయి. గడిచిన ఎనిమిది రోజుల్లో రెండు ప్రమాదాల్లో ఎనిమిది మంది మృత్యువాతపడ్డారు. ఈ నెల 16న గౌరవరం సమీపంలో ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. ఈ ఘటన మరువక ముందే సరిగ్గా ఎనిమిది రోజుల్లోనే బుధవారం వేకువన మరో ఘోరం జరిగింది. చెన్నై నుంచి ఏలూరు వెళ్తున్న కారు టోల్‌ప్లాజా సమీపంలో రోడ్డు మార్జిన్‌లో నిలిపి ఉంచిన కంటెయినర్ లారీని ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడగా వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఏలూరు వైఎస్సార్ నగర్‌కు చెందిన ఇమిటేషన్ జ్యూవెలరీ వ్యాపారులు కుమార్ (45), జ్యోతి (38), సిరి అలియాజ్ రాజీ (38) ఈ ప్రమాదంలో ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. ముసునూరు టోల్‌ప్లాజా సమీపంలో ఈ ఏడాది ఫిబ్రవరి 10న రోడ్డుమార్జిన్‌లో ఆగి ఉన్న లారీని ఢీకొన్ని ఓ లారీ అదుపు తప్పి డివైడర్ దాటి మరో మార్గంలో వెళ్తున్న ట్రావెల్స్ బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో 8 మంది దుర్మరణం చెందారు. ఈ ప్రమాదాలకు కారణంగా రోడ్డు మార్జిన్‌లో నిలిపి ఉంచిన లారీలే కావడం గమనార్హం.

పోలీసులు దండకాలకే పరిమితం

లారీ డ్రైవర్ల నిర్లక్ష్యం, పోలీసులు, నేషనల్ హైవే సిబ్బంది బాధ్యతా రాహిత్యం కారణంగా హైవేపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. గడిచిన 75 రోజుల్లో జరిగిన ప్రమాదాల్లో 16 మంది మృత్యువాత పడ్డారు. కావలి–సున్నపుబట్టీ మధ్య హైవేకు ఇరువైపులా రోడ్డు మార్జిన్‌లో లారీలు ఇష్టారాజ్యంగా నిలిపేస్తున్నారు. హైవే మార్జిన్‌లను ట్రక్ పార్కింగ్ ఏరియాల మాదిరిగా వాడుకుంటున్నా అటు హైవే సిబ్బంది, ఇటు పోలీసు సిబ్బంది పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. హైవేపై గేదల లోడు లారీలను, వరికోత యంత్రాలను వెంటాడి డబ్బులు వసూలు చేసే పోలీసులు, రోడ్డు పక్కన ప్రాణాలు తీస్తున్న లారీలను మాత్రం పట్టించుకోవడం లేదు. డాబా హోటళ్ల వద్ద పదుల సంఖ్యలో రోడ్డుపైనే లారీలను నిలిపి ఉంచుతున్నా, కూడళ్లల్లో ఇష్టారాజ్యంగా వాహనాలు ఆపుతున్నా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. హైవే సిబ్బంది అసలు లారీల విషయమే పట్టించుకోవడం మానేశారు. డాబా హోటళ్ల మెప్పు కోసం రోడ్డు పక్క లారీల విషయంలో చూసీ చూడనట్లు ఉంటున్నారు. వరుస ప్రమాదాలు జరుగుతున్నా, మీడియాలో పదేపదే కథనాలు వస్తున్నా పోలీసుల్లో మాత్రం చలనం రావడం లేదు.

ఐదు నామినేషన్లు దాఖలు


ఆత్మకూరులో వైఎస్సార్‌సీపీ డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న మేకపాటి పృథ్వీరెడ్డి

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గానికి సంబంధించి సార్వత్రిక ఎన్నికలకు బుధవారం మొత్తం ఐదు నామిననేషన్లు దాఖలు అయినట్లు, ఆర్‌ఓ, ఆర్డీఓ కె మధులత తెలిపారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా మేకపాటి విక్రమ్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థులుగా నాగసాయి రామనారాయణ రెడ్డి, దాని రామనారాయణ రెడ్డి (రెండో సెట్) నామినేషన్లు దాఖలు చేయగా, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ తరఫున సయ్యద్ షుకూర్ 4వ సెట్ నామినేషన్ దాఖలు చేశారని, వైఎస్సార్‌సీపీ డమ్మీ అభ్యర్థి మేకపాటి పృథ్వీకుమార్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేసినట్లు వివరించారు.

ఉదయగిరి: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఉదయగిరి నియోజకవర్గానికి బుధవారం ఐదు నామినేషన్లు దాఖలైనట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా మేకపాటి రాజగోపాల్ రెడ్డి 2 సెట్లు, ఆయన కుమారుడు అభినవ్‌రెడ్డి ఒక సెట్, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్, పిరమిడ్ పార్టీ అభ్యర్థి నల్లపనేని వెంకటేశ్వర్లు ఒక సెట్ వంతున నామినేషన్ దాఖలు చేశారు.

ఐదుగురు వలంటీర్లు రాజీనామా

చేజర్ల: మండలంలోని తూర్పుపల్లి, టీకేపాడు సచివాలయం పరిధిలో పనిచేస్తున్న ఐదుగురు వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను బుధవారం ఎంపీడీఓకు అందజేశారు. ఇప్పటి వరకు ప్రజాక్షేత్రంలో ప్రభుత్వం అందించిన పథకాలను ప్రజలకు చేర్చడంలో జగనన్న సైన్యంలా పనిచేశామని, ఇప్పుడు ఎన్నికల పేరుతో ప్రతిపక్షాలు చేసిన కుట్రలకు బలైపోయామన్నారు. రాజీనామా చేసిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి పనిచేస్తామన్నారు.